ఎంఎస్ఎంఇ సర్వేకు సహకరించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం : ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంపు స్కీమ్ ద్వారా రాష్ట్రంలోనూ ఎంఎస్ఎంఇ ఏకీకృత పోర్టల్ ప్రారంభించిందని, ర్యాంపులోని ఒక అంశమైన ఎంఎస్ఎంఇ ఫార్మలైజేషన్‌లో భాగంగా ప్రభుత్వం పరిశ్రమల శాఖకు నిర్వహిస్తున్న సర్వే సహకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. భీమవరం కలెక్టరేట్‌లో ఏపి ఎంఎస్ఎంఇ వన్ బ్యానర్‌ను ఆయన శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తయారీ, సేవ వాణిజ్యరంగంలోని అన్ని ఎంఎస్ఎంఇలను సర్వే చేసే వాటిని డిజిటల్ ప్లాట్ ఫామ్‌లో తీసుకొచ్చి ఏపి ఎంఎస్ఎంఇ వన్ పోర్టల్‌కు అనుసంధించడం ద్వారా ఎంఎస్ఎంఇ డేటా బేస్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని అన్ని డేటా బేస్‌లను అభివృద్ధి చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడానికి సులువుగా ఉంటుందన్నారు.

ఓట్లు.. లెక్కలు..!

2019 ఎన్నికల్లో ఓట్ల ప్రాతిపదికగా గెలుపోటములపై అంచనాలు
15 స్థానాల్లో 13 చోట్ల వైసిపి గెలుపు - 46.35 శాతం ఓటింగ్
టిడిపి రెండు చోట్ల విజయం - 36.30 శాతం ఓటింగ్
జనసేనకు వచ్చిన ఓట్ల శాతం 11.68
2024 ఎన్నికల్లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మరో రెండు వారాల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే వైసిపి జిల్లాలోని అన్ని స్థానాల్లో అభ్యర్థుల ఎంపికను పూర్తి చేసింది. టిడిపి, జనసేన ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా మరో ఏడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల సరళిని బట్టి టిడిపి, జనసేన పొత్తుతో అత్యధిక స్థానాలను గెలుచుకుంటామని ఇరు పార్టీల నాయకులు అంచనా వేస్తుండగా, తాము అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు వైసిపిని గెలిపిస్తాయంటూ ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటిలో వైసిపి 13 చోట్ల గెలుపొందగా, టిడిపి పాలకొల్లు, ఉండి స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. జనసేన ఒక్కచోట కూడా గెలుపును దక్కించుకోలేకపోయింది. గత ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తు లేకుండా విడివిడిగా పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలైన ఓట్లు 82.44 శాతం. వీటిలో వైసిపికి 46.35 శాతం ఓట్లురాగా, టిడిపికి 36.30 శాతం, జనసేనకు 11.68 శాతం ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓటింగ్ శాతం వచ్చిన వైసిపి అత్యధిక స్థానాలను సాధించింది. టిడిపి, జనసేన ఓటింగ్ కలిపితే 47.98 శాతంగా ఉంది. అంటే రెండు పార్టీలకు పోలైన ఓట్లు వైసిపి కంటే ఎక్కువగానే ఉన్నాయి. ఈ ప్రాతిపదికన టిడిపి, జనసేన నాయకులు రాబోయే ఎన్నికల్లో గెలుపోటములపై లెక్కలు కడుతున్నారు. గత ఎన్నికల నాటికి టిడిపి అధికార పార్టీగా ఉంది. దీంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎక్కువగా వైసిపికి పడిందని, అయినప్పటికీ టిడిపి, జనసేన ఓట్లు వైసిపికంటే ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఈసారి పాలకపార్టీగా ఉన్న వైసిపి వ్యతిరేక ఓటు టిడిపి, జనసేనకు పడే అవకాశం ఉందని, దీంతో అత్యధిక స్థానాలు గెలుస్తామని ఆయా పార్టీల నేతలు చెబుతున్నారు.

> **జిల్లాలో ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. రెండు రోజుల క్రితం తాడేపల్లిగూడెంలో జరిగిన టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభ తర్వాత వచ్చే ఎన్నికల్లో గెలుపోటములపై జిల్లా ప్రజానీకంలో చర్చ సాగుతోంది. గత ఎన్నికల్లో ఆయా పార్టీలకొచ్చిన ఓట్లు ఎన్ని అంటూ లెక్కలు కడుతున్నారు. అప్పటి ఓట్లు, ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేకతను అంచనా వేస్తూ గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. దీంతో 2019 ఎన్నికల్లో ఓట్ల లెక్కలపై ప్రతిఒక్కరూ చర్చించుకోవడం కన్పిస్తోంది.**

2019 ఎన్నికల్లో టిడిపి, జనసేన కలిసి పోటీ చేసి ఉంటే..!

గడిచిన సాధారణ ఎన్నికల్లో టిడిపి, జనసేన వేర్వేరుగా పోటీ చేయడంతో అనేక స్థానాలు కోల్పోయామని, లేకపోతే జిల్లాలో సగం సీట్లకుపైగా గెలుచుకునే వారమని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు. గత ఎన్నికల్లో ఏలూరు నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థికి 72,247 ఓట్లురాగా, టిడిపికి 68,175 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి16,681 ఓట్లు వచ్చాయి. టిడిపి, జనసేన కలిసి పోటీ చేసి ఉంటే ఏలూరు స్థానం కైవసం చేసుకునేవారమని లెక్కలు కడుతున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో వైసిపికి 70,741 ఓట్లురాగా, టిడిపికి 54,275 ఓట్లు వచ్చాయి. దీంతో 16,466 ఓట్లతో వైసిపి అభ్యర్థి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి 36,197 ఓట్లు వచ్చాయి. టిడిపి, జనసేన కలిసి పోటీచేసి ఉంటే గెలుపు ఖాయమై ఉండేదని విశ్లేషిస్తున్నారు. తణుకు నియోజకవర్గంలో వైసిపికి 75,978 ఓట్లురాగా, టిడిపికి 73,780 ఓట్లు లభించాయి. దీంతో 2,195 ఓట్లతో వైసిపి గెలిచింది. అదే నియోజకవర్గంలో జనసేన అభ్యర్థికి 31,691 ఓట్లు వచ్చాయి. రెండూ కలిసి పోటీచేసి ఉంటే తణుకు స్థానం గెలిచే వారమని టిడిపి, జనసేన నాయకులు చెబుతున్నారు. భీమవరం నియోజకవర్గంలో వైసిపికి 70,642 ఓట్లురాగా, జనసేనకు 62,285 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి గెలిచారు. అదే నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థికి 50 వేలకు పైగా ఓట్లు వచ్చాయి. నరసాపురం నియోజకవర్గంలో వైసిపికి 55,556 ఓట్లురాగా, జనసేనకు 49,120 ఓట్లు వచ్చాయి. అక్కడ టిడిపికి 27,059 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కూడా కలిసి పోటీ చేయని కారణంగానే ఓటమి పాలైనట్లు చెబుతున్నారు. కైకలూరులో వైసిపికి 82,128 ఓట్లురాగా, టిడిపికి 72,771 ఓట్లు వచ్చాయి. ఈ స్థానాన్ని వైసిపి గెలుచుకుంది. ఆ స్థానంలో జనసేన అభ్యర్థికి 10,738 ఓట్లు వచ్చాయి. కలిసి పోటీ చేసి ఉంటే గెలిచేవారమని లెక్కలు కడుతున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో పొత్తుతో ముందుకు సాగుతుండటంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యధికస్థానాలు గెలుచుకుంటామని టిడిపి, జనసేన నేతలు చెబుతున్నారు. సంక్షేమ పథకాలు తమ పార్టీని గెలిపిస్తాయని వైసిపి నాయకులు చెబుతున్నారు. ఏదేమైనా గత ఎన్నికల్లో జనసేన, సిపిఎం, సిపిఐ సీట్ల సర్దుబాటుతో పోటీ చేశాయి. ఉమ్మడి జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరం, ఉండి, నరసాపురం తదితర నియోజకవర్గాల్లో వామపక్షాలకు ప్రధానంగా సిపిఎంకు ప్రజా పునాది బలంగా ఉంది. వామపక్షాల నుంచి ఓట్ల బదిలీ కూడా జనసేనకు సునాయాసంగానే సాగడంతో నరసాపురం, భీమవరం తదితర స్థానాల్లో వైసిపికి, టిడిపికి కూడా జనసేన అభ్యర్థులు ముచ్చెమటలు పట్టించారు. అయితే ఈ ఎన్నికల్లో పొత్తుతో బరిలోకి దిగుతున్న టిడిపి, జనసేన అభ్యర్థుల మధ్య ఓట్ల బదిలీ కీలకం కానుంది. ఓట్ల బదిలీ సక్రమంగా సాగితే గత ఎన్నికల ఓట్ల ఆధారంగా సాగే విశ్లేషణలు కార్యరూపం దాల్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లోనే అభ్యర్థుల ప్రకటన పూర్తిస్థాయిలో వెలువడనప్పటికీ పలు స్థానాల్లో గెలుపోటములపై పందేలు సాగుతుండటం విశేషం.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

జిల్లాలో 17,690 మంది విద్యార్థులు హాజరు

నరసాపురం : హాల్‌టిక్కెట్ వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఆయా కళాశాలల్లో అధికారులు ఏర్పాటు చేసిన 50 పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు ఆయా పరీక్షా చేరుకున్నారు. ఎనిమిదిన్నర గంటలకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షలు రాసేందుకు మొదటి రోజు కావడంతో విద్యార్థులు కొంచెం కంగారు పడినట్లు కన్పించింది. జిల్లావ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 16,444 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 16014 హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1884 మందికిగాను 1676 మంది హాజరయ్యారు. మొత్తం జిల్లావ్యాప్తంగా 18288 విద్యార్థులకుగాను 17690 మంది పరీక్షలకు హాజరయ్యారు. 96.7 శాతం హాజరు నమోదైంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు సాగాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పోలీసులు పటిష్టంగా అమలు చేశారు. జిల్లావ్యాప్తంగా 50 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 50 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లు, ఏడుగురు అదనపు డిపార్టుమెంట్ అధికారులు, 13 మంది కస్టోడియన్స్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్, రెండు సిట్టింగ్ స్క్వాడ్స్, వెయ్యి మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో భాగస్వాములయ్యారు.

నిరుపేద విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్య

జగనన్న విద్యాదీవెన కింద రూ.26.69 కోట్లు ఖాతాల్లో జమ

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

నిరుపేద విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కృష్ణా జిల్లా పామర్రు నుండి ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో జగనన్న విద్యాదీవెన సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో శుక్రవారం జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని 33,400 మంది విద్యార్థులకు మంజూరైన జగనన్న విద్యా దీవెన లబ్ధి మొత్తం రూ.26,69,17,209 సొమ్ముకు సంబంధించిన నమూనా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి పూర్తిస్థాయి ఫీజు రీయంబర్స్‌మెంటు పథకాన్ని ప్రభుత్వం అమలు చేయడం విద్యార్థులకు మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి శోభారాణి, జిల్లా ఎస్‌టి సంక్షేమ శాఖాధికారి పుష్పరాణి, విద్యాశాఖాధికారులు, జిల్లాలోని పలు డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, నర్సింగ్ ఇతర ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు.



నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వైసిపికి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఉండి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసననుద్దేశించి గోపాలన్ మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను దారిమళ్లించి కార్మికులను రోడ్డు పాల్జేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పక్కదారి పట్టించిన నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేయాలని, 2019 నుండి భవన నిర్మాణ కార్మికులు, కుటుంబాలకు రావాల్సిన పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐ రేవు కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు వీరవల్లి మాధవరావు, సభ్యులు పంపన మహంకాళి, వీరవల్లి శ్రీనివాసరావు, కాలా వెంకటేశ్వరరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆచంట: భవన నిర్మాణ కార్మికుల నుంచి వసూలు చేసిన రూ.1150 కోట్లు నిధులను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేసి బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ డి.సుగుణసంధ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పూసల ఏడుకొండలు, కేతా నాగాంజనేయులు మాట్లాడగా వద్దిపర్తి అంజిబాబు, సానబోయిన సత్యనారాయణ, టి.లక్ష్మీనారాయణ, సత్యవాడ రామ్మోహన్‌రావు, బొంతు శ్రీను, బొలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్ల: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మండా సూరిబాబు కోరారు. సంఘం ఆధ్వర్యంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు గొర్ల రామకృష్ణ, నేతలు పసుపులేటి సత్యనారాయణ, పట్టుబోతుల మధుసూదన్‌రావు, పడమటి పవన్ పాల్గొన్నారు.

తణుకు రూరల్: భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా ఉన్న పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తణుకు తాలూకా న్యూబిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సంక్షేమ బోర్డు పథకాలను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన మెమో 1214ని రద్దు చేసి, బోర్డు ద్వారా గతంలో ఉన్న పథకాలు తిరిగి అమలు చేయాలని, బిల్డింగ్ మెటీరియల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షులు అన్నెం సూర్యనారాయణ, కార్యదర్శి కొల్లి శ్రీనివాస్ మాట్లాడారు. నేతలు రంగారావు, ఎన్.ఆదినారాయణబాబు, బొర్రా రామచంద్రరావు, బోణం రాజు, ఎం.సుబ్రహ్మణ్యం, మల్లుల కేశవరావు, కొంగరాపు శ్రీను, నర్సింహమూర్తి, సాధనాల నాగేశ్వరావు, గుత్తుల శ్రీనివాస్, నూలి గనిరాజు, కొండలరావు పాల్గొన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

ఆకివీడు: సంక్షేమ పథకాల రద్దు కోసం ఇచ్చిన జిఒ నెం.1214ను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రస్థాయి ఉద్యమం చేపడతామని సిఐటియు పట్టణాధ్యక్షులు కె.తవిటినాయుడు హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కేశరెడ్డి ధనరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి కొట్టాడ లీలమనోహర్, ఉపాధ్యక్షుడు నంగేడ్డ కొండ, కోశాధికారి నూకల సత్తిబాబు, నేతలు అంగర శంకర్, గండి చిన్న, పసుపులేటి రాంబాబు, చల్లపల్లి అప్పన్న, గెద్దా పెద్దిరాజు, చినపరపు బాబి తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో...


ఆచంటలో...

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

ఎండిఎంఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణారావు

విద్యార్థినిలతో కలిసి భోజనం చేస్తున్న కో-ఆర్డినేటర్ కృష్ణారావు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రభుత్వం నాణ్యమైన విద్య, మౌలిక వసతులతో పాటు, మధ్యాహ్న భోజనం, పాఠశాలలో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఎండిఎంఎస్ఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని చినఅమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందరించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మరుగుదొడ్లు పరిశీలించారు. రోజుకు నాలుగు దఫాలుగా టాయిలెట్లు శుభ్రం చేస్తున్నందుకు ఆయాలను అభినందించారు. అనంతరం పాఠశాల బాలికల కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, బాలికా విద్య ఆవశ్యకత, నేటి సమాజంలో బాలికలు ఎదుర్కొనే సమస్యల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.అనురాధ, పికెడి.రాజ్యలక్ష్మి, సిహెచ్.ప్రసాదరావు, సునీత, రవిరాజు, సంతోషి పాల్గొన్నారు.

ఓటును వజ్రాయుధంగా వినియోగించుకోవాలి

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్లందరూ ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వజ్రాయుధంగా వినియోగించాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. భీమవరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అంశంపై శుక్రవారం నిర్వహించిన కళాజాతా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలో అత్యధిక ఎన్నికల వ్యయం జరుగుతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాజాత ద్వారా ఆటపాట మాటలతో ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. శ్రీ విజ్ఞానవేదిక వ్యవస్థాపకులు చెరుకువాడ రంగసాయి, మాజీ సర్పంచి తాడినాడ బాబు మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడంలో కళారూపాలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొని నిజాయితీపరులను ఎన్నుకోవాలన్నారు. ఐఎఎస్, ఐపిఎస్, ఐఆర్‌ఎస్ పదవులను అధిరోహించిన అనేకమంది అత్యున్నత అధికారులు, మేధావులతో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఓటర్ల జాబితాలోని లోపాలను సరి చేయడానికి కృషి చేస్తుందన్నారు. ప్రజా సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకులు ఆర్.రాజేష్ నేతృత్వంలో 11 మంది కళాకారులు నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో దండు శ్రీనివాసరాజు, వైవి.ఆనంద్ చాన్ బాషా పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాష్ట్రంలోనే నరసాపురం ప్రథమం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

అభివృద్ధిలో నరసాపురం నియోజకవర్గం రాష్ట్రంలో ముందు ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని సారవ, వేములదీవి పడమర, వేములదీవి తూర్పు గ్రామాల్లో రూ.5.93 కోట్ల నిధులతో నిర్మించిన, చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని సారవ గ్రామం సెంటర్‌లో రూ.4.66 కోట్లతో నిర్మించే లక్ష్మణేశ్వరం, పెదమైనవానిలంక ఆర్అండ్‌బి రహదారి నుంచి పెద సారవ గాంధీ నగరం మీదుగా పెదలంక వరకు నిర్మించే రహదారి, వేముల దీవి పడమర రూ.33 లక్షలతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకు, తాగునీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని, రూ.39 లక్షలతో నిర్మించిన పలు సిమెంటు రహదారులు, కాలిబాట వంతెన, వేములదీవి తూర్పు గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన పలు సిమెంటు రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందిస్తుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పెదలంక వేములదీవి, పడమర వేములదీవి ఈస్ట్ గ్రామాలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమని నాగరాజు, జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, ఎంపిపి మైలాబత్తుల సోని, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్‌నాయుడు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, చినిమిల్లి చందు, కడలి రాంబాబు పాల్గొన్నారు.

వైసిపిలోకి జోగయ్య కుమారుడు సూర్యప్రకాష్

ప్రజాశక్తి - పాలకొల్లు

కాపు సంక్షేమ శాఖ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య తనయుడు సూర్యప్రకాష్ శుక్రవారం సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. శుక్రవారం ఉదయం జనసేన పిఎసి పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ జనసేన సీట్లు కోట్ల రూపాయలకు అమ్ముకున్నారన్నారు. పార్టీకి రూ.వందల కోట్ల పార్టీ ఫండ్ వచ్చిందని, ఆ వివరాలను బహిర్గతం చేయాలన్నారు. ఇతర పార్టీలో ఉన్నవారికి జనసేన సీట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. తన తండ్రి సామాజిక బాధ్యతలపై పోరాడే మనస్తత్వం గలవారని చెప్పారు. తనకు కులమత బేధాలు లేవని, ఒక రాజకీయ వేత్తగా అందరూ కావాలని చెప్పారు. కాపులను అణచివేసిన చంద్రబాబుతో ఆయన పొత్తు పెట్టుకోవడం కనీసం జనసేన ముఖ్యనేతలకు తెలియకుండా చేశారన్నారు. చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు రాజమండ్రికి వచ్చిన పవన్‌కళ్యాణ్ ఏకపక్షంగా టిడిపికి మద్దతు ఇచ్చారన్నారు. కేవలం కాపుల ప్రయోజనాల కన్నా చంద్రబాబు కుమారుడు లోకేష్ ముఖ్యమంత్రి కావడానికి పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. తాను ఏ పదవీ ఆశించి వైసిపిలో చేరడం లేదని చెప్పారు. సామాజికంగా కులమత బేధాలు లేకుండా కృషి చేస్తున్న ఏకైక వ్యక్తి సిఎం జగన్ అని, అందుకే ఆ పార్టీలో చేరానని చెప్పారు.

జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జోగయ్య కుమారుడు సూర్యప్రకాష్

సమస్యలు పరిష్కరించండి

పివిఎల్‌కు తాళ్లకోడువాసుల వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

తాళ్లకోడు జగనన్న కాలనీలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు వైసిపి నియోజకవర్గ కన్వీనర్ పివిఎల్.నరసింహారాజును కోరారు. శుక్రవారం తాళ్లకోడులో జరిగిన పట్టాల పంపిణీ కార్యక్రమం సందర్భంగా కాలనీలోని పలువురు మహిళలు సిపిఎం నాయకత్వంలో నరసింహారాజుకు తమ సమస్యలను వివరించారు. 1200 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, ఇప్పటికే 400 కుటుంబాలు ఇక్కడ నివశిస్తున్నామని, అయినా ఇక్కడ ఎటువంటి సదుపాయాలూ లేవని వారు వాపోయారు. వెంటనే తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ సదుపాయాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కడగల తవిటమ్మ, బి.యెహోషువా, డి.భారతి, ఎన్.శివశంకర్, పిసిని సింహాచలం, సిపిఎం నాయకులు కె.తవిటినాయుడు, సందక సూరిబాబు, బి.రాంబాబు, యర్రా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పివిఎల్‌కు వినతిపత్రం అందిస్తున్న తాళ్లకోడువాసులు

నేడు పాక్సో అమలుపై అవగాహనా సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

పోక్సో చట్టం అమలు, బాధితులకు సహాయక చర్యలు, ఎన్‌డిపిఎస్ చట్టం, అత్యాచారం, ఇతర నేరాల్లో బాధిత మహిళలకు సహాయం, నల్సా సహాయ పథకం తదితర అంశాలపై ఈ నెల 2వ తేదీ శనివారం ఏలూరులో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో జరిగే ఈ కార్యక్రమంలో ఏలూరులోని ఎస్‌పి కార్యాలయంలోని సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


ఆచంట : పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రం గణపవరం జూనియర్ కాలేజీలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 232 మందికి ఆరుగురు హాజరు కాలేదని కాలేజీ ప్రిన్సిపల్ రామచంద్రరాజు తెలిపారు. విద్యార్థులకు కాలేజీ అధికారులు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఉండి : మండలంలోని యండగండి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ పెద్దిరాజు తెలిపారు. 179 మంది విద్యార్థులకు 170 మంది హాజరవ్వగా 9 మంది గైర్హాజరయ్యారు.

నరసాపురం : నరసాపురంలో ఆదిత్య, వైఎన్ డైమండ్ జూబ్లీ, శ్రీ సూర్య, ఉమెన్స్, గౌతమి, భాస్కర కళాశాలల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద144 సెక్షన్ అమలులో ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆచంట : మండలంలోని ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షకు 81 మందికి 80 మంది హాజరైనట్లు డిఒ పోతురాజు, ప్రిన్సిపల్ అప్పారావు తెలిపారు. ఒకేషనల్‌కు సంబంధించి 33 మందికి 28 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాడేపల్లిగూడెం : పట్టణంలోని డిఆర్.గో యంకా మహిళా కళాశాల, ఆదిత్య జూనియర్ కాలేజీ, జిఎం ఆర్ జూనియర్ కాలేజీ, ప్రగతి జూనియర్ కాలేజీ, వాసవి కాలేజీ, పెంటపాడు గోయంకా మహిళా కాలేజీల్లో పరీక్షలు నిర్వహించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించారు.

ఆకివీడు : జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్, కార్తికేయ జూనియర్ కాలేజీ, దుంపగడప శతజయంతి జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 772 మంది విద్యార్థులకు 710 మంది హాజరవ్వగా 62 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని తెలిపారు.

పాలకొల్లు : పాలకొల్లులో మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎఎస్ఎన్ఎం జూనియర్ కాలేజీలో 643 మంది, కోనేట్ జూనియర్ కాలేజీలో 324 మంది, సవిత జూనియర్ కాలేజీలో 293 మంది, ఆదిత్య జూనియర్ కాలేజీలో 569 మంది, చైతన్య జూనియర్ కాలేజీలో 598 మంది, గౌతమి జూనియర్ కాలేజీలో 407 మంది పరీక్షకు హాజరుకానున్నారు. మొత్తం పట్టణంలో 2834 మంది పరీక్ష రాయాల్సి ఉంది.

తణుకు :తణుకు పట్టణంలో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో ఎనిమిది సెంటర్లలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 3005 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 2898 హాజరు కాగా 107 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను తణుకు డిప్యూటీ తహశీల్దార్ ఉదయభాస్కర్ పరిశీలించారు.

ఎన్నికల స్టేషనరీ సామగ్రి సరఫరాకు టెండర్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సార్వత్రిక ఎన్నికలకు జిల్లాలోని 1,754 పోలింగ్ స్టేషన్లకు స్టేషనరీ సామగ్రి సరఫరా చేయడానికి ఆసక్తి ఉన్న ఏజెన్సీల నుంచి సీల్డ్ టెండర్లను కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ఏజెన్సీలు ఈ నెల రెండో తేదీ నుంచి ఏడో తేదీ మధ్య అన్ని పనిదినాల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భీమవరం కలెక్టరేట్ కార్యాలయంలోని కోఆర్డినేషన్ సెక్షన్ నుంచి టెండర్ ఫారమ్‌లను పొందాలని తెలిపారు. సీలు చేసిన టెండర్లను ఏడో తేదీ సాయంత్రం నాలుగు గంటల లోపు కోఆర్డినేషన్ సెక్షన్, భీమవరం కలెక్టర్ కార్యాలయం వద్ద టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు భీమవరం కలెక్టర్ ఛాంబర్‌లో టెండర్లు తెరుస్తారని, అదే రోజు టెండర్ ఫైనల్ చేస్తారని పేర్కొన్నారు.

'ఆదిత్య' విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక ఆదిత్య స్కూల్లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్-2 కార్యక్రమంలో ఎల్‌కెజి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులతో అద్భుతంగా జరిగిందని స్కూల్ డైరెక్టర్ లయన్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. ఎస్ఎల్‌సి ముఖ్య ఉద్దేశం విద్యార్థుల్లో ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీయడమే

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

లే ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్ చెప్పారు. వాళ్లు ఆయా తరగతుల్లో ఆయా సబ్జెక్టుల్లో నేర్చుకున్న దానిని వారి తల్లిదండ్రులకు, ఇతర విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధానాలతో వివరించారన్నారు. విద్యార్థుల మేధస్సును, సృజనాత్మకతను వెలికితీసేలా ఇటువంటి సైన్స్ కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ బి.యుగంధర్ మాట్లాడుతూ ఎస్ఎల్‌సి ఎడ్యుకేషన్ ఫెయిర్ వంటిదన్నారు. ఈ కార్యక్రమంలో కెవి.సత్యనారాయణ, దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణ పరిధిలో 27వ వార్డు ధర్మపురినగర్ వీవర్స్ కాలనీలో రూ.10.40 లక్షలు పురపాలక సంఘం సాధారణ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డు, డ్రెయిన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

'ప్రజల అభ్యున్నతి కోసమే పాదయాత్ర'

ప్రజాశక్తి - ఇరగవరం

సమాజంలో అన్ని తరగతుల అభ్యున్నతి కోసం తన పాదయాత్ర అని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర కాకిలేరు నుంచి కంతేరు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - కాళ్ల

విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు


శ్రీనివాసరాజును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

(వాసు) అన్నారు. మండలంలోని పెదఅమిరంలో నిర్మలాదేవి ఫంక్షన్ హాలులో ఎస్ఆర్ క్షత్రియ విద్యార్థుల క్షత్రియ ఫెస్ట్ శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు(వాసు) ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. క్షత్రియ కమిటీ సభ్యులు శ్రీనివాసరాజును సత్కరించారు.

మోగల్లు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి -పాలకోడేరు

మోగల్లు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా శ్యామ్ కుమార్ నియమితులయ్యారు. మండలంలోని కోరుకొల్లు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న శ్యామ్‌కుమార్‌ మోగల్లు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా నియమితులయ్యారు. గతంలో మోగల్లు పంచాయతీ రెగ్యులర్ కార్యదర్శి, పాలకోడేరు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా పనిచేసిన కనుమూరి వెంకటరాజుపై అనేక అభియోగాలు వచ్చాయి. మోగల్లు గ్రామానికి చెందిన నేతల శ్యామ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శి వెంకటరాజుపై అనేక అభియోగాలు చేస్తూ అప్పటి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి పలుమార్లు ఫిర్యాదు చేశారు. దీనిలో భాగంగా అభియోగాలున్న వెంకటరాజును జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోదూరు మండలం పండితవిల్లూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకోడేరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా విస్సాకోడేరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బొక్క జార్జ్‌ప్రసాద్‌ను నియమించినట్లు ఎంపిడిఒ అనూష తెలిపారు.

పార్కును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి

ప్రజాశక్తి - నరసాపురం

పార్కును పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ చైర్పర్సన్ వెంకటరమణ అన్నారు. పట్టణంలో 29వ వార్డు కాటన్ పార్కులో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పార్కు పనులను మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ మణి, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

సైపువారిమెరకలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - నరసాపురం

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమై రెండు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నరసాపురం అగ్నిమాపక అధికారి భాస్కర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తూర్పుతాళ్లు పంచాయతీ సైపువారిమెరకలో ఆకుల సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల తాటాకింట్లో శుక్రవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్‌సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతులు ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. సత్యనారాయణకు పక్షవాతం రావడంతో పింఛన్ డబ్బులతోనే ఆ దంపతులు జీవిస్తున్నారు. అదే ఇంట్లో పక్కన గదిలో కొండేటి లక్ష్మి నివాసం ఉంటున్నారు. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాదంలో నగదు, కొంత బంగారం కాలిపోయాయని,మొత్తం రూ.2.50 లక్షల ఆస్తినష్టం సంభవించిందని బాధితులు ఆవేదన చెందారు.

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాం

బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని, అధైర్య పడొద్దని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సత్యనారాయణ, కొండేటిలక్ష్మిలను ఆయన పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని, అధైర్య పడొద్దని చెప్పారు. పక్కా గృహం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు.

మాజీ ఎంఎల్ఎ బండారు పరామర్శ

ఆకుల సత్యనారాయణను మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి నాయకులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని ఉనుదుర్రు గ్రామంలోని పేకాట స్థావరంపై ఉండి పోలీసులు గురువారం అర్ధరాత్రి దాడి చేసి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,170 నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల సమయానికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని నోడల్ అధికారి, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జిసిహెచ్.ప్రభాకరరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నియోజవర్గస్థాయిలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. అనంతరం ఆచంట పురవీధుల గుండా ర్యాలీ, ఆచంట కచేరి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. మన పాలకులను ఓటుతో ఎన్నుకునే అవకాశం మనకు రాజ్యాంగం కల్పించిందన్నారు. పౌరులందరికీ ఓటు వినియోగించే విధానం కూడా తెలిసి ఉండాలన్నారు. యువత ఓటు హక్కు కలిగి ఉండడం, ఓటు వేయడం బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ టి.మూర్తిబాబు, పెనుగొండ, పెనుమంట్ర ఎంపిడిఒలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు శ్రీదేవికి సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టేలర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని యాజమాన్యం, సిబ్బంది శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు ఆర్‌విఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించిన సభకు పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పోతుల జగన్మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టేలర్ స్కూల్ అభివృద్ధికి, విద్యార్థుల భవితవ్యానికి శ్రీదేవి అందించిన సేవలను కొనియాడారు. కడిమిళ్ల వరప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. విశ్రాంత, ప్రస్తుత ఉపాధ్యాయులు హరనాథ్‌కృష్ణ, టి.కృష్ణవేణి, ప్రసాదరావు, మీనాక్షి, వర్మ, జెవిఆర్, లక్ష్మి, రామాంజనేయులు, భాస్కరరావు, గంగారావు, కోమలి, పూర్వ విద్యార్థులు కామన నాగిని, అడబాల సుస్మిత, రేఖపల్లి సురేష్, భగవాన్, పవన్, రాంబాబు, అడ్డాల హరి, విరించి, పి.ఠాగూర్ పాల్గొన్నారు.

జెసిఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా ధనుంజయ

ప్రజాశక్తి - ఉండి

జెసిఎస్ ఉండి నియోజకవర్గ కన్వీనర్‌గా వైసిపి సీనియర్ నాయకులు ధనుంజయ నియామకమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ధనుంజయ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జెసిఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించిన డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరవేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పివిఎల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ధనుంజయకు బిసి సంఘం జిల్లా అధ్యక్షులు సూరవరపు వెంకాటాచార్యులు, పార్టీ మండలాధ్యక్షులు ఆంజనేయరాజు, బిసి ఉండి నియోజకవర్గ సంఘం సోషల్ మీడియా కన్వీనర్ అరివెల్లి బలరాముడు, నాయకులు మున్నలూరి శ్రీనివాస్, భాగ్యరాజుతో పాటు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆచంట

సిఎం జగన్ పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి జరిగిందని ఆచంట ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర మండలం పొలమూరులో గడపగడపకూ మన ప్రభుత్వంలో ఇచ్చిన హామీలో భాగంగా డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. నెలమూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం'

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సిఎం జగన్ పని చేస్తున్నారని వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని తాళ్లకోడులో రిజిస్టర్ ఇళ్ల పట్టాలను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ హైమావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పివిఎల్ మాట్లాడారు. పేదల వైసిపి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. నరసాపురం లోక్ సభ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వి.వెంకటరాజు, ఎంపిపి కటారి జయలక్ష్మి, ఎఎంసి చైర్‌పర్సన్ షేక్ హసీనాబీబి, రూరల్ బ్యాంక్ ఛైర్మన్ కేసి రెడ్డి మురళి, పార్టీ భీమవరం ఎన్నికల అబ్జర్వర్ మోటుపల్లి గంగాధరరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు పుప్పాల సత్యనారాయణ, వంగ ఝాన్సీ పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

4న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

ఆర్‌టిసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము అన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీన విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్‌టిసి గ్యారేజీలో కార్మికులతో కలిసి ఆయన శుక్రవారం కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా పొన్నాడ రాము మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలన్నారు. ఆర్థిక శాఖ ఇచ్చిన జిఒ ప్రకారం ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలన్నారు. ఆర్‌టిసిలో థర్డ్ పార్టీ కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేసి ఆర్‌టిసి సంస్థ నేరుగా జీతాలు ఇవ్వాలన్నారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల నాలుగో తేదీన విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ట్రాఫిక్ ఎస్ఐ నాగలక్ష్మి

కాళ్ల :ప్రతి విద్యార్థిని పవర్ ఫుల్ మహిళగా తయారు కావాలని, అప్పుడే తమను తాము రక్షించుకుని సమాజానికి ఒక ఆదర్శ మహిళగా ఎదగగలరని భీమవరం ట్రాఫిక్ పోలీస్ ఎస్ఐ నాగలక్ష్మి అన్నారు. కోపల్లె హైస్కూలులో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ అంశంపై మూడు రోజులు పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆలోచనలతో విద్య అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి మాట్లాడారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు మూడు రోజులుగా విద్యార్థులకు కరాటే, సెల్ఫ్ డిఫెన్స్ వంటి అంశాలపై శిక్షణ అందించటం వల్ల విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని పలు అధ్యాపకులు తెలిపారు.

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : ఎంఎల్ఎ గ్రంధి

వీరవాసరం :రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం సిఎం జగన్‌తోనేఢ సాధ్యమని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలో సుమారు 2.48 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శుక్రవారాం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తోలేరులో రూ.19.20 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. రూ.41.70 లక్షల నిధులతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు, రూ.18 లక్షలతో నిర్మించే సీసీ డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అండలూరులో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.15 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. అండలూరు సహకార సంఘం గోదాం మరమ్మతులు, ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నౌడూరులో రూ.17 లక్షలతో నిర్మించిన వివో భవనాన్ని, రూ.8.20 లక్షలతో నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కొణితివాడలో రూ.34.20 లక్షలతో నిర్మించనున్న తాగునీటి సరఫరా పథకానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నల్లి మెల్లి వేణుక, బీశెట్టి లక్ష్మి, భీమవరం ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, అండలూరు సొసైటీ ఛైర్మన్ మానుకొండ ప్రదీప్ కుమార్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసిపి మండల కన్వీనర్ కడలి ధర్మారావు, వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నాకు న్యాయం చేయండి

తన భూమిని వేరొకరి పేరున మార్చారని మహిళ ఆవేదన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం సౌత్‌లో తాను పట్టా పొందిన రెండున్నర ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు అక్రమంగా ఆన్‌లైన్‌లో వేరొకరి పేరున మార్పు చేశారని కొల్లాటి జయలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె శుక్రవారం విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. గ్రామంలో తాను గతంలోనే రెండున్నర ఎకరాల భూమికి పట్టా పొంది, ఆ భూమికి పన్నులు తానే చెల్లిస్తున్నానని చెప్పారు. జనవరి వరకు ఆ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో తన పేరు పైనే ఉన్నాయని తెలిపారు. ఆ భూమికి సంబంధించి వివరాలను రెవెన్యూ అధికారులు అక్రమంగా రుద్రరాజు కృష్ణవేణి పేరున మార్పు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్

ప్రజాశక్తి - ఆకివీడు

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. దేశంలో 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని, వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు లభించడం లేదన్నారు. స్థానిక ఐఎఫ్‌టియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి శేషగిరిరావు అధ్యక్షతన హమాలీ కార్మికుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికులను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు వారి మేనిఫెస్టోలో అసంఘటిత కార్మికుల కోసం హామీలను పొందుపరచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శేషగిరిరావు, రాంబాబు, శ్యామ్, శ్రీనివాస్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మండల విస్తరణాధికారిగా రామకృష్ణారెడ్డి

ఉండి : ఉండి మండల ప్రజా పరిషత్ నూతన విస్తరణాధికారిగా ఎం.రామకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రామకృష్ణారెడ్డి గతంలో తూర్పుగోదావరి జిల్లా కపిలేశ్వరపురం విస్తరణాధికారిగా పనిచేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఉండికి బదిలీ కాగా ఉండి విస్తరణాధికారిగా పనిచేసిన కొండలరావు కపిలేశ్వరపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుని గ్రామాలాభివృద్ధికి వంతు కృషి చేస్తానని చెప్పారు.

నేడు పాలకొల్లు మండల సమావేశం

పాలకొల్లు రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో రెండో తేదీ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు మండల పరిషత్ సమావేశం ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఇరగవరం

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య సేవలను అందరూ ఉచితంగా పొందాలని కంతేరు గ్రామ సర్పంచి గుడిమెట్ల ఆదిలక్ష్మి తెలిపారు. మండలంలోని కంతేరులో శుక్రవారం నిరవహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.క్రాంతిరెడ్డి, ఎంపిటిసి గుడిమెట్ల దుర్గ, వైద్యురాలు వై.మౌనిక, కంతేరు పంచాయతీ కార్యదర్శి వి.రాజు, జివి.రెడ్డి, ఇరగవరం మండల పరిధిలోని ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : మండలంలోని చిలుకూరు సచివాలయ పరిధిలోని వెలివర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెలివర్రు గ్రామ సర్పంచి పెన్మెత్స అంజనీదేవి, చిలుకూరు గ్రామ సర్పంచి ముదునూరి వెంకట సోమరాజు, యండగండి సర్పంచి గోగులమండ చిన్నకృష్ణమూర్తి, ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపిటిసి సభ్యులు కరణం త్రిమూర్తులు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు ఈది ఎడ్వర్డ్ జాన్సన్, నాయకులు పాల్గొన్నారు.

గణపవరం : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకరరావు అన్నారు. కొత్తపల్లి పంచాయతీ యుపి స్కూలులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి కొత్తపల్లి, వరదరాజపురం గ్రామాల సర్పంచులు మద్దాల రత్నకుమారి, గుర్రం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్‌నాయుడు, పి.కిరణ్మయి, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, డాక్టర్లు సిహెచ్.కావ్య, ఐ.శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా 'మానవత'

ప్రజాశక్తి - ఉండి

నిరుపేదలకు అండగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉంటుందని సంస్థ జిల్లా కన్వీనర్ కాకర్ల వినాయక్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఉండి మండల్యాధ్యక్షులు కట్రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని ఉప్పులూరు గ్రామానికి చెందిన వికలాంగుడు మోటుపల్లి తేజకు మూడు చక్రాల వాహనాన్ని సంస్థ తరపున అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కన్వీనర్ కాకర్ల వినాయక్ హాజరయ్యారు. ఉప్పులూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తి పక్షవాతంతో ఇబ్బందులు పడుతుండగా అతనికి రూ.రెండు వేలు అందించారు. ప్రభుత్వం నుంచి సహకారం లభించేలా ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప్పులూరు గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు, మానవతా మండల చైర్మన్ రుద్రరాజు యువరాజు, కో-చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, కన్వీనర్ కొమ్మన నాగబాబు, మండల కమిటీ సభ్యులు గంధం ఏడుకొండలు, డైరెక్టర్ మంగిన శ్రీహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జెండా సభ ఫెయిల్

యడ్ల తాతాజీ

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి, జనసేన కలిసి తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ తుస్సుమనిపించిందని డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. పవన్‌కళ్యాణ్ విడిగా పెట్టిన సభ కంటే తాడేపల్లిగూడెం సభకు తక్కువ స్థాయిలో కార్యకర్తలు హాజరయ్యారని చెప్పారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబులు తమ స్థాయిని మరచి ఊగిపోతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మాట్లాడుతున్నారన్నారు. ఎంఎల్ఎ కూడా ఇదే స్థాయిలో అసందర్భ విమర్శలు చేస్తున్నారని చెప్పారు. ఈ మీడియా సమావేశంలో వైసిపి నేతలు కావలి శ్రీనివాస్, పెచ్చెట్టి కృష్ణాజి, ఉనికెల శ్రీను, చెన్ను విజయ్, రేలంగి శ్రీనివాస్, పాలపర్తి కృపానాధ్, గంటా నరేష్ పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

నా క్లయింట్ అయిన ఏలూరు జిల్లా, లక్ష్మీపురం గ్రామం, పెదవేగి (మం)కు చెందిన **శ్రీ సూర్రెడ్డి లక్ష్మి వరప్రసాద్, S/o. వెంకటేశ్వరరావు** అను వారు తెలియజేయునది ఏమనగా, వారి యొక్క **ఒరిజినల్ దస్తావేజు** నెం. **6403/1986** రు గల తేది. 17-10-1986 గల డాక్యుమెంట్ పెదవేగి గ్రామము నందు జిరాక్స్ తీయించుటకు వెళ్ళుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియచేయగలరు.

E.SRINIVASA BABU
Advocate, ELURU
Ph: 08812-239498

ఎమర్జన్సీ సర్టిఫికెట్(EC)పోయినది

RAMANI DURGA అను నాకు BAHRAIN దేశంలోని భారత రాయబార కార్యాలయం అధికారులు ది.13-12-2021న X0533900 నెంబరుగల ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC) మంజూరు చేసారు. సదరు EC జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది. 23-02-2024న పల్లిపాలెం నుండి కాళీపట్నం వెస్టు గ్రామంలో జిరాక్స్ సెంటర్‌కు వెళ్ళుచుండగా నా ఒరిజినల్ EC పోయినది. గాన నా ఎమర్జన్సీ సర్టిఫికెట్ (EC)ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అదించగలరని కోరుతున్నాను

RAMANI DURGA
W/o. Ramani Edukondaluo
D.No. 2-50, Pallipalem
Kalipatnam West, Mogaltur Mandal
West Godavari Dist., A.P.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, వీరవాసరం మండలం, నందమూరు గరువు, డోర్ నెం. 2-82/ఏ కు చెందిన పాలపర్తి వినోద్, S/o. బాబూరావు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెం. **T2482500,** ది. 5-2-2024వ తేదీన నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టును జిరాక్స్ తీయించుకొనుటకు నా గ్రామం అయిన నందమూరు గరువు నుండి వీరవాసరం నా యొక్క మోటార్ సైకిల్‌పై వెళ్ళుచుండగా మధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

పాలపర్తి వినోద్
S/o. బాబూరావు, డోర్ నెం. 2-82/ఎ,
నందమూరు గరువు, వీరవాసరం మండలం,
ప॥గో॥జిల్లా, సెల్: 9989667147

NAME CHANGE

I, Perumalla Radha Krishna S/o P. Sri Rama Chandra Murthy. R/o D.No. 15-5-5, Paluru Vari Street, Maruthi theatre Center , Bhimavaram - 534201, West Godavari Dt. A.P India. have changed my name from PERUMALLA RADHA KRISHNA to PERUMALLA VENKATA RADHA KRISHNA MURTHY on vide affidavit dated 28-02-2024 before Notary.

మహారాజశ్రీ ఏలూరు 1వ అదనపు జిల్లా కోర్టు, ఏలూరు
ఇ.పి. నెం. 751/2021 ఇన్ ఎ.ఆర్.సి. నెం. 160/2021

బిట్వీన్:
మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, తాడేపల్లిగూడెం ...**-డి. హెచ్. ఆర్.**
మరియు
రుట్టల వి.ఎల్.నరసింహారావు మరియు యితరులు ...**-జె. డి. ఆర్స్**

యిందు పై నెంబరు ఇ.పి. గ్రంధములో ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని పై కోర్టులో వేలం వేయబడును. యావన్మంది పాటలో పాల్గొనవచ్చును. వేలము **ది. 21-03-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట వేలం వేయబడును. పబ్లికేషన ద్వారా తెలియపర్చడమైనది.

షెడ్యూలు

West Godavari District, Bhimadole Sub-Registry, Rallakunta Village, R.S. No. 31, a plot an extent of 300.0.0. sq.yds. is bounded by: **EAST:** Road - 45'-0". **SOUTH:** Puntha - 60'-0". **WEST:** Site of Smt. Tandra Rama Devi - 45'-0". **NORTH:** Site of plot No. 19 - 60'-0"

With all easementary rights over the schedule immovable property for ingress or egress.

DHR Value Rs. 4,00,000/-
Amin Value Rs. 18,00,000/-
(1వ అదనపు జిల్లా కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

K.V.S.N.R.GOPAL, Advocate
Eluru, Cell: 9949885456

In the Court of the Addl. Senior Civil Judge, Eluru
E.P. 10/2029, O.S. 55/2013

Between:
వేల్పుల వెంకటేశ్వరరావు ...*D.Hr*
AND
దేవు నాగరాజు, S/o. రామారావు, విద్యుత్ నగర్ కాలనీ, వట్లూరు, పెదపాడు మండలం. ...*J.Dr*

వేలము నోటీసు

పై నంబరు దావా గ్రంధములోని D.Hr తన బాకీని వసూలు చేసుకునే నిమిత్తం దాఖలు చేసిన ఈ E.P. గ్రంధములో దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **ది. 15-03-2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలం వేయబడును. వేలంలో పాడుకొనదలచిన వారు ఉదయం 10.30 గం॥లకు ఆధార్ కార్డులతో వచ్చి వేలంలో పాల్గొనవలసినదిగా కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు.

షెడ్యూలు

Landed property in an extent of Ac. 0-10 cts covered by R.S. No. 114/3, situated in Kolaparru Grama Panchayat, Pedapadu Mandalam, Eluru SRO, W.G.Dt., with the following boundaries.

EAST: Land of Kadaganchi Lakshmi. **SOUTH:** Land of Balda Manikyamma. **WEST:** Land of Ramini China Venkateswara Rao. **NORTH:** Land of Vare Veera Swamy.

An extent of Ac. 0-10 cts of land, with all the easementary rights.

D.Hr Value - more than five lakhs.
Amin Value- Rs. 2,33,000/-

Eluru **S.BRAHMAM,** Advocate
Dt.01-03-2024 Eluru, Cell: 9492932214

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814